క్లుప్తంగా

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల సందర్శన


ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తున్న ఎంపీడీఓ స్వరూప రాణి

సాక్షి ఎఫెక్ట్...

మక్కువ: మండలంలోని ఎర్రసామంతవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి సందర్శించారు. ఈనెల 27న సమస్యలకే వసతి అన్న కథనం సాక్షిలో వెలువడడంతో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల హాజరు, రికార్డుల నిర్వహణ, పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ, విద్యార్థులకు అందించే భోజనం మెనూ, నాణ్యతను ఆమె పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలలో 20 మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టాలని గుర్తించారు. అలాగే పాఠశాల ఆవరణలో 200 మీటర్ల వరకు ప్రహరీ నిర్మించాల్సి ఉందని ఎంపీడీఓ స్వరూపరాణి గుర్తించారు.

గర్భిణుల రిజిస్ట్రేషన్ సక్రమంగా చేయాలి


సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ కేవీఎస్ పద్మావతి

పార్వతీపురం రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణుల రిజిస్ట్రేషన్ సక్రమంగా చేసి అబా ఐడీ క్రియేట్ చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి కేవీఎస్ పద్మావతి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె పార్వతీపురం మండలంలోని డోకిశీల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ జ్వరాల వ్యాప్తిని అడిగి తెలుసుకున్నారు. సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న పాఠశాల విద్యార్థులకు నిర్వహించాలని సూచించారు. అలాగే సమీపంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలకు వెళ్లి సిక్ రూంలో జ్వరంతో బాధపడుతున్న ఆరుగురు విద్యార్థులను పరామర్శించి అందిన వైద్యసేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఐశ్వర్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాల నివారణకు ప్రభుత్వం స్పందించాలి


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వివిధ సంఘాల నాయకులు

పార్వతీపురం: గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తీరాలని, అలాగే గిరిజన సంక్షేమశాఖ మంత్రి మొదటి సంతకం మేరకు గతంలో పనిచేసిన ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని గిరిజన, విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఐటీడీఏ నిధులు దారి మళ్లించారని, ఆ నిధులతో వైద్య సిబ్బందిని నియమించవచ్చన్నారు. గిరిజన అని పేరు చెప్పి మంత్రులు అవుతున్న వారు గిరిజన విద్యార్థుల ప్రాణాలు కాపాడడానికి తీసుకుంటున్న చర్యలు శూన్యమన్నారు. కనీస స్థాయిలో పరిహారం కూడా ఇవ్వలేదన్నారు. వసతిగృహాల్లో సరిపడా వంట, బోధనేతర సిబ్బంది లేక మెనూ అమలు కాక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ సమస్యలకు పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణమని, గిరిజన విద్యార్థులు మరణిస్తున్నా ప్రభుత్వం అధికారులు నిర్లక్ష్యంగా ఉండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ గిరిజన, ప్రజా సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు, పల్ల సురేష్, ఆరిక చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకృష్ణ, కాంగ్రెస్ నాయకుడు వంగల దాలినాయుడు, ప్రజా సంఘాల నాయకులు సోమేష్, బుజ్జి, పి.సంఘం, శ్రీహరి, జగదీష్, గణేష్, పకీరు, కృపాకర్, న్యాయవాది వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రాళ్లు తేలిన అంటివలస రోడ్డు



సాలూరు రూరల్: మండలంలోని అంటివలస గ్రామానికి వెళ్లే రహదారి రాళ్లు తేలడంతో పాటు అడుగడుగునా పెద్దపెద్ద గోతులతో ప్రమాదకరంగా మారింది. మామిడిపల్లి అడ్డురోడ్డు నుంచి అంటివలస వరకు వెళ్లాలంటేనే ద్విచక్రవాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. ఈ రహదారి ఎత్తుపల్లాలుగా ఉండడంతో ప్రయాణించడం ప్రమాదకరంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముస్తాబవుతున్న గణనాథులు

- మట్టితో తయారుచేస్తున్న విగ్రహాలు


రూపురేఖలు దిద్దుకుంటున్న ప్రతిమలు


సింహంపై అధిష్ఠించిన గణనాథుడు


రంగులు వేయడానికి సిద్ధంగా గణపయ్య

సీతానగరం:

వినాయక నవరాత్రి మహోత్సవాలు వస్తున్నాయంటే తెలుగు రాష్ట్రాల్లో తొలిపండగ సందడి వాతావరణం మొదలైనట్లే. ప్రతి పూజలో తొలిపూజ అందుకునే గణపతికి నవరాత్రులు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు, వర్తక సంఘాలు, ఉద్యోగులు, విద్యార్థుల హడావుడి ప్రారంభమైంది. దాదాపు దశాబ్ద కాలానికి పైగా సీతానగరంలోని సాలావారివీధి, సుంకరివీధి, కుమ్మరివీధి, గూడెం, అప్పయ్యపేట, కూరగాయల మార్కెట్‌లో ప్రతి ఒక్కరూ మట్టితో తయారుచేసిన భారీ విగ్రహాలు ఏర్పాటు చేయడాన్ని ప్రజలు ఆస్వాదిస్తున్నారు. ఈ ఏడాది కూడా అందుకు మినహాయింపు ఉండదనే ఆయా ఉత్సవ నిర్వాహకులు చెబుతున్నారు.

సీతానగరంలో విగ్రహాల తయారీ

సీతానగరంలో కుమ్మరి కులస్తులు వినాయక విగ్రహాలు తయారు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడి విగ్రహాలు చూడముచ్చటగా ఉండడంతో ఉత్సవ కమిటీల ప్రతినిధులు వినాయక విగ్రహాల తయారీదారులకు అడ్వాన్సులు చెల్లిస్తున్నారు.

ఆర్డర్లు వస్తున్నాయి



ఉత్సవ కమిటీల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. విగ్రహాల తయారీకి అవసరమైన వరిగడ్డి, వరిపొట్టు, బూడిద, కొబ్బరి పీచు, రంగులు తదితర ముడిసరుకు ధరలు పెరుగుతున్నాయి. దీంతో విగ్రహం ధర రూ.10 వేల నుంచి రూ.25 వేల పెరిగే అవకాశం ఉంది. అడ్వాన్సులు తీసుకుంటున్నాం. ముందుగా చెప్పిన ధరకే విగ్రహాలను అప్పజెప్పాలి.

చింతల త్రినాథ్, విగ్రహాల తయారీదారు, సీతానగరం

చంద్రబాబు ష్యూరిటీ నీటిమీద రాతలే..!


అరసాడలో ప్రచారం చేస్తున్న నాయకులు


కోరెగ్రామంలో గడప గడపకు వెళ్లి ఇంటింటికి వంచన కరపత్రాన్ని అందజేస్తున్న పార్టీ నాయకులు


పట్టణంలోని 20, 21వార్డుల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు

బలిజిపేట: చంద్రబాబు ఇచ్చిన ష్యూరిటీలు నీటి మీద రాతలేనని ఎంపీపీ నాగమణి విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచనల మేరకు మండలంలోని అరసాడలో చంద్రబాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ అమలుకాని హామీలను ఇవ్వడం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం చంద్రబాబు నైజమని ఎద్దేవా చేశారు. కూటమి పాలనలో అంతా అరాచకం, ధరల పెరుగుదల, కానరాని సంక్షేమ పథకాల అమలు, మోసమే తప్ప మరేమీ లేవన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుల్ల ప్రభావతి, పి.రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జెడ్పీటీసీ రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ప్రసాదరావు, మేధావుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పీఎస్ఆర్ నాయుడు, ఆర్గనైజేషనల్ కార్యదర్శి కె.మోహనరావు, మండల వీవర్స్ సొసైటీ అధ్యక్షుడు నారాయణరావు, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు జి.పకీరునాయుడు, రైతు విభాగం మండలశాఖ అధ్యక్షుడు జి.సత్యనారాయణ, కె.పాపినాయుడు, జి.గంగయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం మండలంలో..

పార్వతీపురం రూరల్: బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ, ఇంటింటికి వంచన కార్యక్రమంలో భాగంగా ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లినప్పుడు ప్రజలను అడగకుండానే చంద్రబాబు, కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను చెబుతున్నారని పార్వతీపురం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఈ మేరకు పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో శుక్రవారం పార్వతీపురం మండలంలోని గంగాపురం పంచాయతీ కోరె గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ, ఇంటింటికి వంచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాన్ని వివరించి ప్రజలను చైతన్యపరిచారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, మజ్జి శేఖర్, బడే రామారావు, బి.వాసు, పెండ రమణ, ఎస్.శ్రీరాములు నాయుడు, మడక విశ్వనాథం, గణేష్, వైస్ ఎంపీపీ బి.రవికుమార్, సర్పంచ్ గండి శంకరరావు, యాండ్రాపు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం పట్టణంలో..

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని పార్వతీపురం మున్సిపాలిటీలో గల 20,21వార్డుల్లో వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన వంచనను వివరించి ఇంటింటికీ వంచన కరపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ బోనుగౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, బీసీ సెల్ అధ్యక్షుడు గొర్లి మాధవరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసరావు, కౌన్సిలర్లు సువ్వాడ లావణ్య, వి.నేతాజీ, జి.గాయత్రి మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్‌షఫీ, షేక్ జలాల్, కోలా సుధ, నియోజకవర్గ అనుబంధ విభాగ నాయకులు, స్థానికులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె

- సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్


ఆర్టీసీ డిపో ఆవరణలో సమ్మె చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం డిపో పరిధిలోని ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు వేతన ఒప్పందం చేయాలని కోరుతూ శుక్రవారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు వై.మన్మథరావు, బీవీ రమణలు మాట్లాడుతూ 2019 నుంచి నేటి వరకు వేతన సవరణ చేయకపోవడం సమంజసం కాదని తక్షణమే అద్దె బస్సు డ్రైవర్ల వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. రోజుకు 12,18 గంటలు విధులు నిర్వహిస్తున్నప్పటికీ చాలీచాలని వేతనం ఇస్తున్నారన్నారు. వేతన సవరణ చేయాలని ఇప్పటికే ఆర్టీసీ అధికారులకు, కలెక్టర్, కార్మిక శాఖ అధికారులకు తెలియజేసినప్పటికీ ఫలితం శూన్యమన్నారు. ఆర్టీసీ అధికారులు కార్మికులకు మేలు చేయకపోగా అద్దె బస్సు యజమానులకు మద్దతుగా మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఆర్టీసీ డిపో అధికారులకు కార్మికుల సమస్యలు పరిష్కారంపై చిత్తశుద్ధి లేదని, సమ్మె చేయవలసిన తప్పనిసరి పరిస్థితి కార్మికులకు వచ్చిందన్నారు. ఇప్పటికైనా డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని, తొలగించిన వారిని విధులలోకి తీసుకోవాలని, వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రెడ్డి వేణు, గొర్లి వెంకటరమణ, బి.సూరిబాబు, అద్దె బస్సు డ్రైవర్ల సంఘం నాయకులు వీరాచారి, దుర్గాప్రసాద్, మన్మథరావు, అశోక్, అద్దె బస్సుల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ శోభ


పార్వతీపురం టౌన్: దుర్గాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణంలో శ్రావణ శోభ నెలకొంది. శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని అమ్మవార్ల ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవార్లను దర్శించుకుని కుంకుమార్చనలు, పూజలు చేశారు. కొన్ని ఆలయాల్లో సామూహిక వ్రతాలు నిర్వహించారు. దుర్గ చెట్టు, వైకేఎం కాలనీ, బెలగాం, కొత్తవలస దుర్గాలయానికి భక్తులు అధికసంఖ్యలో రావడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బలిజిపేటలో..

బలిజిపేట: శ్రావణ మాసంలో ప్రసిద్ధమైన రెండవ శుక్రవారం పర్వదినం కావడంతో ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని బలిజిపేట, అజ్జాడ, చిలకలపల్లి సంతోషిమాత ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో వచ్చి దూపదీప నైవేద్యాలు సమర్పించారు.

అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి 'పోలీసు వెల్ఫేర్‌డే'


ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డికి సమస్యలను తెలుపుకుంటున్న పోలీసుశాఖ సిబ్బంది

పార్వతీపురం రూరల్: నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమై ఉండే సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పోలీసు సిబ్బందికి వెల్ఫేర్‌డే (గ్రీవెన్స్ డే) నిర్వహించి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పోలీసు శాఖలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది నుంచి వచ్చిన విజ్ఞాపనలు స్వీకరించి, సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యల కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది వృత్తిలోను, శాఖాపరంగా ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమానికి అలాగే, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన సమస్యలను పరిష్కరించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీసీ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సొంతడబ్బులతో గిరిజనుల రోడ్డు నిర్మాణం


రోడ్డు నిర్మాణం చేసుకుంటున్న బెల్లపాక గిరిజనులు

సాలూరు రూరల్: మండలంలోని కరడవలస నుంచి బెల్లపాక గ్రామానికి గిరిజనులు తమ సొంతడబ్బులతో రోడ్డు నిర్మాణం చేసుకుంటున్నారు. గ్రామానికి రోడ్డు నిర్మాణం చేస్తారని ఎదురు చూసి చివరకు గ్రామస్తులు అందరం కలిసి రోడ్డు నిర్మాణం చేసుకోవాలని నిర్ణయించుకున్నామని ఆ మేరకు జేసీబీతో రోడ్డు చదును చేస్తూ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తున్నట్లు బెల్లపాక గ్రామస్తులు తెలిపారు.

మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

వంగర: మండల పరిధి మడ్డువలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జంపా రాధిక శుక్రవారం తెలిపారు. 5వ తరగతిలో 44 సీట్లు, 6వ తరగతిలో 13 సీట్లు, 7వ తరగతిలో ఎనిమిది సీట్లు, 9వ తరగతిలో ఆరు సీట్లు ఖాళీలున్నాయని, అర్హులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థినిలు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దయనీయ స్థితిలో నిరాశ్రయుల వసతి గృహం


నిరాశ్రయుల వసతిగృహంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని రైతు బజార్ వద్ద గల నిరాశ్రయుల వసతిగృహం దయనీయ స్థితిలో ఉందని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం నిరాశ్రయుల వసతిగృహాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరలు మండిపోతున్న ఈ రోజుల్లో ఒక వ్యక్తికి ఒక రోజుకు 50 రూపాయలు ఏ విధంగా సరిపోతాయని ప్రశ్నించారు. గత 17 నెలలుగా బిల్లులు చెల్లించకపోతే వసతిగృహం నిర్వహణ ఏ విధంగా జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే వృద్ధులు, నిరాశ్రయుల కోసం నిరంతరం పనిచేసే సిబ్బందికి కనీస వేతనం ఇవ్వాలని కోరారు. తక్షణమే ఉన్నతాధికారులు నిరాశ్రయుల గృహాన్ని తనిఖీ చేసి, ఆశ్రయం పొందుతున్న వారి సాధక బాధకాల పట్ల స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు కోలా కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఆదివాసీ దినోత్సవంలో భాగస్వాములు కండి

- ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం టౌన్: ఈ నెల 9వ తేదీన జరగనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో భాగస్వాములు కావాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ గిరిజన సంఘాల నాయకులను కోరారు. ఈ మేరకు స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో గిరిజన సంఘాల నాయకులతో పీఓ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, అందుకు తగిన సూచనలు చేయాలని కోరారు. ఇది మనందరి కార్యక్రమమని, ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా జరిగేందుకు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. సమష్టి భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏపీఓ ఎ.మురళీధర్, పలు గిరిజన సంఘాల నాయకులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిపాలు శ్రేయస్కరం


తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తున్న సీడీపీఓ రాజ్యలక్ష్మి


వెంకంపేటలో అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్‌మోహన్‌రావు

బలిజిపేట: పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని బలిజిపేట సీడీపీఓ రాజ్యలక్ష్మి తెలిపారు. తల్లిపాల వారోత్సవాలను బలిజిపేట, అరసాడ, గంగాడ గ్రామాల్లో శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిపాలు ఏవయస్సు వరకు పిల్లలకు పెట్టాలో వివరించారు. తల్లిపాలు ఎక్కువగా ఉత్పత్తి అవాలంటే తల్లులు ఎటువంటి ఆహారాన్ని తీసుకోవాలో తెలియజేశారు. తల్లిపాల ప్రాముఖ్యత, కలిగే లాభాలు, నష్టాలను వివరించారు. తల్లిపాల వల్ల పిల్లల ఎదుగుదల బాగుంటుందని తెలిపారు. ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా పిల్లలకు తల్లిపాలను అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎస్.సులేఖ, పద్మావతి, టాటా ట్రస్ట్ అసోసియేట్ జగన్మోహన్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు సంజీవిని

పార్వతీపురం రూరల్: ఆరోగ్య కరమైన బిడ్డ పెరుగుదలకు తల్లిపాలు తప్పని సరి అని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వెంకంపేటలో శుక్రవారం బాలింతలు, గర్భిణులకు నిర్వహించిన అవగాహన సదస్సులో తల్లిపాల ప్రాముఖ్యతపై ఆయన సూచనలు చేశారు. బిడ్డ పుట్టిన గంటలోపే తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి సహజ టీకా అని తెలిపారు. ఇందులో ఉండే ప్రొటీన్లు, ఫ్యాటీ యాసిడ్స్, లాక్టోజ్, విటమిన్లు ఇమ్యూనోగ్లోబ్యూలిన్స్ బిడ్డ సంపూర్ణ ఎదుగుదలకు రోగ నిరోధక వ్యవస్థ బలపడడానికి తోడ్పడతాయన్నారు. శిశువుకు వ్యాధుల నుంచి రక్షణ కలిగిస్తాయని చెప్పారు. శిశువుతోపాటు తల్లి కూడా ఆరోగ్య వంతంగా ఉంటుందని, బిడ్డకు, తల్లికి అనుబంధం బలపడి శిశువు మానసిక, శారీరక అభివృద్ధికి తోడ్పడతాయని ఈ సందర్భంగా తెలియజేశారు. అలాగే పాలు పెట్టే విధానం, జాగ్రత్తలు, పరిశుభ్రతపై క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, డీపీహెచ్‌ఎస్ ఉషారాణి, డెమో సన్యాసిరావు, సూపర్‌వైజర్స్ శ్రీరాములు నాయుడు, నాగమ్మలతో పాటు వైద్య, అంగన్వాడీ, 104 సిబ్బంది పాల్గొన్నారు.

శివరాంపురంలో తల్లిపాల వారోత్సవాలు

సాలూరు రూరల్: మండలంలోని శివరాంపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్త పార్వతి పిల్లల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.

ఫ్యాప్టో ధర్నా విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఫ్యాప్టో ప్రతినిధులు

సీతానగరం: ప్రభుత్వం వద్ద అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించనందుకు నిరసనగా శనివారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయసంఘాల(ఫ్యాప్టో)సమాఖ్యనాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సీతానగరం మండల విద్యావనరుల కేంద్రంలో ఫ్యాప్టో సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని, డీఏలు మంజూరుచేసి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమానికి ఫ్యాప్టో సభ్యులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఫ్యాప్టో మండల కమిటీ అధ్యక్షుడు పి.కూర్మినాయుడు, పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, పి.సత్యనారాయణ, ఎస్.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మందు బాబులను తొలగించాలి



ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజన సంఘాల నాయకులు

పార్వతీపురం రూరల్: విద్యాబుద్ధులు బోధించాల్సిన ఉపాధ్యాయులే మందుబాబులుగా మారితే విద్యార్థుల పరిస్థితి ఏమవుతుందని, అటువంటి ఉపాధ్యాయులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.అనిల్, టి.అఖిల్ మాట్లాడుతూ పార్వతీపురం మండలంలో డోకిశీల ఆశ్రమ పాఠశాలలో కొన్ని రోజులుగా ఇద్దరు ఉపాధ్యాయులు నిరంతరం మద్యం తాగుతూ ఉంటున్నారని, దీనిపై విద్యార్థులు, మరికొంతమంది ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నప్పటికీ వారిలో ఎటువంటి మార్పు లేదని, ఈ కారణంగా విద్యార్థులు మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎటువంటి హెచ్చరికలు కూడా ఖాతరు చేయని ఉపాధ్యాయుల తీరుపట్ల కొంతమంది విద్యార్థులు కూడా మద్యానికి బానిసలుగా మారే పరిస్థితి నెలకొంటుందని, దానివల్ల కొంతమంది విద్యార్థులు అనారోగ్యం బారిన పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టర్ దృష్టిసారించి ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంపై సస్పెన్షన్ విధించాలి

పార్వతీపురం టౌన్: కొమరాడ మండలం కెమిశీల గిరిజన ఆశ్రమ పాఠశాల హెడ్ మాస్టర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయంగా ఐటీడీఏ పీఓ పర్యటనలో పాఠశాలలో పలు లోపాలు ఆయన స్వయంగా గుర్తించిన నేపథ్యంలో తక్షణమే హెడ్ మాస్టర్ ను సస్పెండ్ చేయాలని గిరిజన సంఘాల తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తాడంగి సాయిబాబు, గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు పల్ల సురేష్, గిరిజన అభ్యుదయ సంఘం నాయకుడు ఆరిక చంద్ర శేఖర్, ట్రైబల్ రైట్స్ ఫోరమ్ నాయకులు ఇంటికుప్పల రామకష్ణ, రొబ్బ లోవరాజు, గిరిజన ఐక్య వేదిక నాయకులు బిడ్డిక తమ్మయ్య, ఆరిక విప్లవ కుమార్, సీదారపు రాజు, జట్ల బంగార్రాజు, మన్యం గిరిజన సేవా సంఘం నాయకులు మంచాల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.